ధారావాహిక

భాగం -2

# చైతన్య స్రవంతి

(సాంఘిక నవల)



డా. జి.భవానీ కృష్ణమూర్తి

తల్లి తండ్రి వద్దన్నా, అక్క కార్తీక తాను డబ్బు పంపిస్తా... అప్పు తీర్చేయమని అన్నా, చైతన్య స్వప్నని పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకున్నాడు.

ఈ వయసులో తండ్రి అంత డబ్బు సంపాదించి అప్పు తీర్చలేడు. రెండు కోట్లు కోసం విలువైన ఇంటిని అయినకాడికి అమ్మడమూ ఇష్టం లేదు.అవసరానికి అమ్ముకుంటే ధరతక్కువకి పడిపోతుంది.

వాళ్ళు చేయని అప్పు తీర్చడానికి అక్క, బావ కష్టార్జితాన్ని రామానుజానికి ఇవ్వడము న్యాయంగా అనిపించలేదు.మనసు చంపుకుని అందుకే స్వప్నని పెళ్ళి చేసుకోడానికే నిశ్చయించుకున్నాడు చైతన్య.

కాలు ఒకటి లోపం తప్ప స్వప్న మంచి పిల్ల. అందుకే అలాంటి నిర్ణయం తీసుకున్నాడు.

రామానుజం వ్యాపారధోరణిలో వ్యవహారించాడు కనుక, తనూ ఆ పద్ధతిలోనే పెళ్ళిసమయంలోనే తమ మధ్య ఏ విధమైన ఆర్థిక,వ్యాపార లావాదేవీలేమీ లేవని,స్టాంప్ పేపర్ మీద రాసి సంతకం చేసి ఇవ్వాలని షరతు పెట్టాడు..పెళ్ళికి అత్యంత సన్నిహితులు, కుటుంబ మిత్రులను మాత్రమే పిలిచారు. రామానుజం ఇంటిలోనే క్లుప్తంగా పెళ్ళి జరిగింది.

ఆ సమయంలోనే ముందుగా అనుకున్నట్లు, ఇద్దరి మధ్య ఎలాంటి ఆర్థిక, వ్యాపారపరమైన సంబంధాలు లేవని, స్నేహాన్ని బంధుత్వం గా మార్చుకుంటున్నట్లు స్టాంప్ పేపర్ మీద రాసి, సంతకం చేసి చైతన్యకి ఇచ్చాడు రామానుజం. తమ ఇంట్లో స్వప్నతో గృహప్రవేశం, సత్య నారాయణ వ్రతం జరిగాయి.

భోజనం చేస్తూ, లేచి వెళ్ళడానికి కాలు సహకరించక, అక్కడే వాంతి చేసుకుంది స్వప్న..

చైతన్య లేచి చెయ్యి కడుక్కుని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"పెళ్ళి హడావిడిలో నిద్రలేక, అలసటవల్ల అనుకుంటా" అంటూ తమ పనిమనిషిని అక్కడ శుభ్రం చెయ్యమని, కూతుర్ని గదిలోకి తీసికెళ్ళింది తల్లి కమల.

భోజనం చేసి బయలుదేరబోతున్న తమ ఫ్యామిలీ డాక్టర్ శ్యామలని ఆపి, స్వప్నని చెకప్ చెయ్యమన్నాడు రాఘవరావు.

"అక్కర్లేదు రాఘవా, అలసట వల్లనే. అదే తగ్గిపోతుందిలే" అన్నాడు రామానుజం.

"ఇప్పుడు ఆ అమ్మాయి మా కోడలు.. ఆవిడ మా ఫ్యామిలీ డాక్టర్. ఒకసారి చూడనివ్వు. అవసరం అయితే బలానికి ఏదైనా ఇంజక్షన్ చేస్తారు

"అని,శ్యామలని స్వప్న ఉన్న గదిలోకి పంపించాడు.

శ్యామల స్వప్న ని పరీక్ష చేసి, విషయం చైతన్య చెవిలో వేసింది.

****

నెల రోజులు రాఘవరావు, జానకమ్మలతోనే ఉండిపోయింది స్వప్న.

అబార్షన్ అంటే నాలుగో నెల వచ్చేసింది. పెద్ద ప్రాణానికి ప్రమాదం అని చెప్పింది డాక్టర్ శ్యామల. ఆ ఆలోచన విరమించుకోక తప్పలేదు.



రెండు రోజులు సెలవు పెట్టి వచ్చిన చైతన్య, స్వప్నని తనే తీసికెళ్లి పుట్టింట్లో వదలిపెట్టి వచ్చేశాడు. విడాకులకి అప్లై చేయమని లాయర్ కి చెప్పి, తల్లిని తండ్రిని హైదరాబాద్ తీసుకొచ్చేశాడు.

అప్పుడుగానీ ప్రశాంతంగా అనిపించలేదు చైతన్యకి.

ఫోన్ చేసినప్పుడల్లా తల్లి, స్వప్న చేసే హంగామా అంతా ఇంతా కాదని చెప్తుంటే,రామానుజానికి రెండు మూడు సార్లు చెప్పి చూశాడు.

అయినా మార్పు లేదు. అందుకే ఆ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది.

కాలు అవిటి గానీ నోరు పెద్దది.చేసిన వంటకాలు నచ్చలేదని, మీరే ఇవ్వాలిగాని ఇంటి కోడలికి,పనివాళ్ళతో కాఫీ, ఫలహారాలు పంపిస్తారా?అంటూ రోజూ తగువు పెట్టుకునేదనీ తల్లి చెప్తుంటే చిరాకు అనిపించేది.

"వాళ్లూ పెద్దవాళ్ళు, కోడలిచేత చేయించుకోవలసిన వాళ్ళు.

కోడలు కానీ మీ అమ్మాయికి వాళ్ళు సేవలు చేయడం ఏంటి? మీ అమ్మాయికి బుద్ధి చెప్పుకోలేరా?"అనిఫోన్ లో చెప్పాడు.

"చిన్నప్పటినుంచి గారాబంగా పెరిగింది మరి..."తల్లి దీర్ఘాలు తీస్తుంటే

"అందుకే అదుపాజ్ఞలు లేకుండా... సారీ..."ఫోన్ పెట్టేశాడు.

తనే తీసికెళ్లి దిగబెట్టి, తల్లిదండ్రుల్ని తీసుకొచ్చేశాడు.

***

రియల్ ఎస్టేట్ వ్యాపారి రాంప్రసాద్ కాల్ చేసి రమ్మంటే, సాయంత్రం ఆఫీస్ నుంచి అటు వెళ్ళాడు చైతన్య. "ఏంటి ఇటు రావడం మానేశావ్?"అడిగాడతను..

"మీ ఫ్రెండ్ చేసిన మోసంతో మీ దగ్గరకి రావడానికి కూడా భయం వేసింది. అందుకే మీ దగ్గర కాకుండా వేరే జాబ్ లో జాయిన్ అయ్యాను సార్" జరిగినదంతా దాపరికం లేకుండా చెప్పేశాడుచైతన్య.

"వాడిది మొదటినుంచి అటువంటి బుద్దే. నువ్వు వాడితో నన్ను కంపేర్ చెయ్యకు."

"ఏమో, నా భయం నాది సార్.మిడిల్ క్లాస్ వాడిని. నాన్న సంపాదించినదంతా ఇచ్చేసి, సెటిల్ చేసుకున్నా. అంగ వైకల్యం ఉన్నా మంచి పిల్ల అని పెళ్ళి చేసుకుంటే, ఆమె గర్భవతి అని తెలిసింది చెప్పకుండా పెళ్లి జరిపించారు.. వాళ్ళ పిల్లని వాళ్ళ

ఇంట్లోనే వదిలి, అమ్మనాన్ననీ తీసుకొచ్చేశాను "అంటూ జరిగినదంతా చెప్పేశాడు.

"మంచి పని చేశావ్. నీ లాంటి సిన్సియర్ వర్కర్ నాదగ్గర ఉంటే బాగుండేది. అయినా మించిపోయిందేమీ లేదు.

ఇదిగో ఫైల్. చాలా మంచి ప్రాజెక్ట్... బాగా స్టడీ చెయ్యి... ప్లాన్ ప్రిపేర్ చెయ్యి. రాజమండ్రిలో పెద్ద షాపింగ్ మాల్. మంచి ప్రాఫిట్ ఉంటుంది. నేను వేరే వర్క్ లో బిజీ గా ఉన్నాను. లేకుంటే నేనే టేకప్ చేసేవాడిని. వాళ్లు రామానుజం వంటివాళ్ళు కాదు, చాలా మంచివాళ్ళు. నీకు ఉండడానికి వసతి అది వాళ్లే ఏర్పాటు చేస్తారు. బాగా ఆలోచించుకో.నీకేమైనా సందేహాలుంటే అడిగి తెలుసుకో."అంటూ, ఆ ఫైల్ లో ఉన్న రెండు సెల్ ఫోన్ నంబర్స్ అండర్ లైన్ చేసి ఇచ్చాడు.

"ఆర్థికంగా నేనేమి పెట్టుబడి..."

"అవసరం లేదు.. వాళ్ల చేత అడ్వాన్స్ ఇప్పిస్తాను. ఆ విషయంలో నాది భరోసా " నమ్మకంగా చెప్పాడు రామ్ ప్రసాద్.

ఇంటికి వచ్చి తండ్రితో ఆ విషయం చెప్పాడు.

ఆయన ఆ ఫైల్ చూసి "మంచి ప్రాజెక్ట్. నీకు నచ్చితే చెయ్యి. మొదటినుంచి నీకు దీనిమీదే ఇంట్రెస్ట్ కదా "అన్నాడు.

"ఇంట్రెస్ట్ ఉన్నమాట నిజమే. అసలే ఆర్థికంగా దెబ్బతిని ఉన్నాం. ఒకవేళ సక్సెస్ కాలేక పోతే..."

"చూడు నాన్నా, మంచి మనసుతో ప్రారంభిస్తే విజయం మనవైపు ఉంటుంది.కేవలం డబ్బు సంపాదన ధ్యేయంతో కాక, వర్క్ శాటిస్ఫెక్షన్ ఉండేలాగ పని చెయ్యి. ఆ నిజాయతీయే నీకు విజయాన్ని అందిస్తుంది" అంది తల్లి.

తల్లి, తండ్రి ప్రోత్సహించడంతో వారం రోజులు కష్టపడి అత్యాధునికంగా ఉండేలా చక్కటి ప్లాన్ తయారు చేశాడు.

రాంప్రసాద్ కి చూపిస్తే, స్వతంత్రంగా గీసిన మొదటి ప్లాన్ అయినా అద్భుతంగా ఉందని మెచ్చుకున్నాడు.

ఇద్దరూ కూర్చుని ఎంత బడ్జెట్, ప్రాఫిట్ ఎంత రావచ్చుఅని చర్చించారు. అక్కడ అంతకుముందు రెండు, మూడు ప్రాజెక్ట్స్ చేసి ఉండడం చేత, అక్కడ పరిచయం ఉన్న మెటీరియల్ సప్లయర్స్ నంబర్స్ ఇచ్చాడు రాంప్రసాద్.

ధైర్యం వచ్చింది చైతన్యకి.

కస్టమర్ తో మాట్లాడి అన్నీ సందేహాలు తీర్చుకున్నాడు.

తల్లి, తండ్రి విజయవాడలో స్వంత ఇంట్లోనే ఉంటామని, దగ్గరే కనుక వస్తూ పోతుండమని కొడుక్కి చెప్పారు. తనూ ఎక్కువగా సైట్ దగ్గరే ఉండవలసిన వస్తుంది కనుక, వాళ్ళు కొత్తచోటులో కంటే అలవాటు అయిన ఇంట్లో ఉంటేనే మంచిది అనుకున్నాడు. రామానుజంతో ఏదైనా సమస్య వస్తుందేమో అనుకున్నాడు గానీ వస్తే, అప్పడే వారిని తనదగ్గరికి తీసికెళ్ళవచ్చు అనుకున్నాడు.

అందుకే వారిని విజయవాడలో దిగబెట్టి, పనివాళ్ళని పిలిచి మళ్ళీ పనిలోకి రమ్మని,తల్లిదండ్రులకి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనకి ఫోన్ చేసి చెప్పమని, తన సెల్ నంబర్ వారికి ఇచ్చి, వాళ్ళ నంబర్స్ తాను తీసుకుని జాగ్రత్తలు చెప్పి, లాయర్ ని కలిసి విడాకుల విషయం గురించి మాట్లాడి, రాజమండ్రి వెళ్ళాడు

(సశేషం)